
# చైతన్య గీతం



డా॥ పోలకారి విజయలక్ష్మి

అరమోడ్పుగా వున్న నంధ్య కనురెప్పల మాటున వలచని వసిడి ఎండ ఒదిగి పోతూంది. లయగా ఊగుతున్న కొబ్బరి ఆకుల నీడలు వాకిటి ముంగిట కదులుతున్న ముగ్గుల్లావున్నాయి. ఆముగ్గుల మీద కుర్చీలు వేసుకుని కూర్చున్నారు భాగ్యలక్ష్మి, ఆమె మనవరాలు ప్రీతి. ప్రీతి చదువు, కాలేజి, ఫ్రెండ్స్, వారి అభిరుచులు మొదలైన విషయాల్ని అడిగి తెలుసుకుంటూంటుంది భాగ్యలక్ష్మి.

"ప్రీతీ! తెలిసి తెలిసి నువ్వీ తప్పునిర్ణయాన్నెందుకు తీసుకుంటున్నావో నాకర్థం కావడంలేదు." తను చెప్పదలచు కున్న దానికి నాందిగా అంది భాగ్యలక్ష్మి.

"భలేదాని వమ్మమ్మా! పెళ్ళి చేసుకుని మీకు బరువు దింపు తాననడం తప్పు నిర్ణయమా?" నవ్వుతూ అమ్మమ్మ మాటల్ని తేలిగ్గా తీసేసింది ప్రీతి.

"అదేం మాటమ్మా? నువ్వుమాకు బరువేమిటి? మీ అక్క చెల్లెళ్ళిద్దర్నీ రెండు కళ్ళు అనుకుంటూ ప్రాణాలన్నీ మీ మీదపెట్టుకుని పెంచుతూంది మీఅమ్మ. పట్టుమని పద్దెనిమిదేళ్ళైనా లేని నువ్వు చక్కగా చదువుకునేది పోయి అప్పుడే పెళ్ళేమిటమ్మా నీకు?" ఎలాగైనా ప్రీతి దృష్టిని పెళ్ళి మీదనుండి మళ్ళించి చదువు మీదలగ్నమయేలా చూడాలని భాగ్యలక్ష్మి తాపత్రయ పడుతూంది.

"ఏం చదువమ్మమ్మా!! బోర్!!... రాత్రింబగళ్ళు కష్టపడిచదివాకయినా పెళ్ళి చేసుకోవాలిగదా?! అమాత్రం దానికి నాకు నచ్చినవాడు దొరికినప్పుడు హాయిగా పెళ్ళి చేసేసుకుని లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యక ఎందుకంత కష్టపడడం?... ఐనా కష్టపడి చదువుకుంటే చదువయిపోగానే ఎవరైనా పిలిచి పూలమాల వేసి ఉద్యోగమిస్తారా?" ప్రీతి వితండ వాదనకు ఆశ్చర్య పోయింది భాగ్యలక్ష్మి. బ్రతుకుగురించి సరైన అవగాహన లేని ప్రీతికి ఒక లక్ష్యమూ వున్నట్లు కనబడడం లేదు. బ్రతుకులో అడుగడునా తారసిల్లే నమస్యల్నించి పారిపోవడానికి ప్రయత్నిస్తూ గాలివాటుకు బ్రతికేసే లక్షణం కనవడుతూంది. ప్రీతికంటే రెండు తరాల ముందు పుట్టిన భాగ్యలక్ష్మి మనవరాలి ధోరణిని అంగీకరించ లేక పోయింది.

"ప్రీతీ! నువ్వింకా చిన్నపిల్లవు. నీకేం కావాలో నువ్వు గుర్తించడంలేదు." అనునయంగా చెప్పబోయింది భాగ్యలక్ష్మి.

"గుర్తించక పోవడమేమిటి? నాకు కావలసింది మంచిజాబ్, డబ్బువుండి నేను సుఖంగా బ్రతకడానికి అన్ని హంగులూ సమకూర్చగల భర్త. నాకు కావలసిన వ్యక్తి నాకు తారస పడ్డాడు. అతను నాన్నగారి ఫ్రెండ్ కొడుకవడం వల్ల అతన్ని ఆకర్షించి పెళ్ళిదాకా లాక్కురావడానికి పెద్ద కష్టపడనవసరం లేపోయింది. "ప్రీతి మాటలు భాగ్యలక్ష్మికి మింగుడు పడడంలేదు.

"అలా చూస్తున్నావేమిటమ్మమ్మా? అతని కోసమెంత కాంపిటీషనో తెలుసా? అందం, చదువు, డబ్బువున్న అతన్ని నేను గెలుచు కోగలిగి నందుకు నాకెంత గర్వంగా వుందో మాటల్లో చెప్పలేను." ప్రీతి వది లేసిన మ రో ముఖ్యమైన అంశం "గుణం" దగ్గర భాగ్యలక్ష్మి ప్రాణం కొట్టుకుంటూంది.

"ప్రీతీ!" భారంగా పిలిచింది భాగ్యలక్ష్మి.

"ఏమిటో త్వరగా చెప్పు అమ్మమ్మా! వానువచ్చేటైమయింది. ఫస్ట్‌షోకి వెళ్దామను కున్నాం. అటు నుంచటు హొటల్‌కు వెళ్దామంటున్నా డతను." ప్రీతి చెప్తూ వుండగానే వాను వచ్చాడు. ప్రీతి హడావిడిగా చెప్పులేసుకుని వ్యానిటీ బాగ్ తీసుకుని అతని వెంట బయల్దేరింది "తలుపు వేసుకో అమ్మమ్మా! అలస్యమైనా కంగారు పడొద్దను అమ్మని" మనవరాలి కెన్నో చెప్పాలని పనిగట్టుకుని వచ్చిన భాగ్యలక్ష్మి హతాశురాలై కూర్చుండి పోయింది. తనకూతురికీ, తన కూతురు కూతురికీ ఎంత వ్యత్యాసం?!... గతంలోకి పరుగులు తీసింది భాగ్యలక్ష్మి మనసు.

* * * *

ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా పనిచేసేవారు తను తన భర్త. చాలీ చాలని జీతం, ఉమ్మడి కుటుంబం, ఎప్పటికప్పుడు పుట్టుకు వచ్చే ఇబ్బందులు, పరిస్థితుల కనుగుణంగా నర్దుకు పోతూ బ్రతికేస్తూవుండగా పుట్టింది స్వరాజ్యం. స్వరాజ్యోద్యమ కాలంలో పుట్టడం వల్ల ఎంతో ఇష్టంగా, గర్వంగా, 'స్వరాజ్యలక్ష్మి' అని పేరు పెట్టుకున్నారు. గుండెల్నిండా ప్రేమవున్నా చేతినిండా డబ్బులేక

పోవడం వల్ల ఊహతెలిసి నప్పటినుండి డబ్బులేని లోటుని అనుభవిస్తూనే పెరిగింది స్వరాజ్యం. అతికష్టం మీద సెకండరీ గ్రేడ్ టీచర యేదాకా ఆమెకు అంతే, యింతే డబ్బుని ఖర్చు పెట్టారు. స్వరాజ్యం తరువాత పుట్టిన మగపిల్లలిద్దర్నీ తమజీతంతో చదివించ లేకపోతే స్వరాజ్యం తన సంపాదనతో ఆదుకుంది. ఒక వైపు ఉద్యోగం చేస్తునే మరోవైపు ప్రైవేటుగా ఎమ్.ఏ. వరకు చదివి కాలేజి లెక్చరర్ అయింది.

"లైటన్నా వేసుకోకుండా చీకట్లో కూర్చున్నా వేమిటమ్మా?" లైట్ వేస్తూ అడిగింది స్వరాజ్యం. కళ్ళు విప్పి కూతురి వంక తేరపార చూచింది భాగ్యలక్ష్మి. పనిచేయడంలో ఆనందాన్ని తన విద్యుక్త ధర్మాన్ని నిజాయితీతో, చిత్తశుద్ధితో నిర్వర్తించడంలో సంతృప్తిని పొందుతూ హుందాగా జీవిస్తున్న కూతుర్ని చూస్తూంటే గర్వంతో ఉప్పొంగుతూందామె హృదయం.

"ప్రీతి ఏదమ్మా?" ప్రీతి కోసం ఇంట్లో వెదుక్కుని వచ్చి అడిగింది స్వరాజ్యం. "వానుతో సినిమాకి వెళ్ళింది. హోటల్‌కి వెళ్తారట. రావడం ఆలస్య మవుతుందని చెప్పమంది." తల్లి స్వరంలోని అయిష్టాన్ని అసంతృప్తిని గమనించింది స్వరాజ్యం.


"చిన్నపిల్ల, దానికి తెలియక పోవచ్చు. నువ్వన్నా చెప్పక్కర్లా? అప్పుడే దానికి పెళ్ళేమిటి? పెళ్ళికి ముందీ షికార్లేమిటి?"

తల్లికి వెంటనే సమాధానం చెప్పలేక పోయింది స్వరాజ్యం.

"ఏది మంచో, ఏదిచెడో నేనే తేల్చుకోలేక పోతున్నానమ్మా! పిల్లల్ని మరీ గిరిగీసి లోపల కూర్చో బెట్టకుండా స్వేచ్ఛగా పెరగనిస్తే సహజంగా వికసిస్తారనే నమ్మకం ఒక ప్రక్క, స్వేచ్ఛ పరిధి, పరిమితి తెలుసు కోకుండా ప్రవర్తిస్తే ఏం అనర్థం జరుగుతుందోననే భయం మరో ప్రక్క. పెళ్ళికి ముందు కలిసితిరుగుతూ ఒకరి భావాల్ని అభిరుచుల్ని అభిలాషల్ని అలవాట్లుని మరొకరు తెలుసుకుంటే ఇద్దరి మధ్య అవగాహన పెరిగి దాంపత్య బంధం పటిష్ఠమవు తుందనే భావం ఒక ప్రక్క, ఏకారణం చేత నయినా అనుకున్నట్లు జరగకపోతే ప్రీతి భవిష్యత్తుకిదే ప్రతి బంధకమవుతుందే మోనన్న ఆందోళన మరో ప్రక్క... ప్రీతిని అతనితో వెళ్ళొద్దనీ చెప్పలేక పోతున్నాను; మనస్ఫూర్తిగా ఆమోదించనూ లేకపోతున్నాను." దిగులుగా చెప్పింది స్వరాజ్యం.

"చదువు అయిపోయి తనకాళ్ళమీద తను నిలబడగలిగే శక్తి వచ్చేదాకా పెళ్ళిమాట తలపెట్టాల్సిందికాదు."

"నేను తల పెట్టానా? ఆ కుర్రాడి నాన్నగారు, మీ అల్లుడు ఫ్రెండ్స్. ఆయన కీఊరు ట్రాన్స్‌ఫర్ అవడంతో వాళ్ళు, మేము కొంచెందగ్గరగా మెలుగుతున్నాము... అమ్మా! దాని చదువుగురించి నాకలలు నీకు తెలును. అప్పట్లో మన పరిస్థితులు బాగుండక ఎన్నో ఒడిదుడుకులు పడి చదువుకున్నాన్నేను. అలాంటిలోటు లేకుండా, కష్టం తెలియకుండా పెంచితే బాగా చదువుకుని ఉచ్ఛస్థితిలోకి వెళ్తుందని ఆశపడ్డాను తప్ప నా కలల్ని ఆశల్ని యిలా చెల్లా చెదురు




చేస్తుందనుకోలేదు." స్వరాజ్యం గొంతు ఒణికింది.

"అసలుదాని ఊహలు, ఆలోచనలు అర్థం పర్థం లేనివిగావున్నాయి. అదిలా తయారవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు."

తల్లి మాటల్తో కళ తప్పింది స్వరాజ్యం ముఖం.

"నిజమేనమ్మా! పార్టీలు, పిక్నిక్స్, బ్యూటీ పార్లర్లు జాలీజాలీగా భర్తతో కలిసి తిరుగుతూ జల్సాగా ఖర్చు పెట్టడం... యివే జీవిత మనుకుంటూంది... తలచుకుంటెనాకు చాలా సిగ్గుగావుంది. నా పెంపకంలో దాని మనస్తత్వాన్ని రూపొందించడంలో నేను దారుణంగా ఫెయిలయా ననిపిస్తూంది. ప్రీతి వ్యక్తిత్వం మీద పిల్లల పెంపకానికి ఎంతో ప్రాధాన్యత నిచ్చే మాత్రభావంకంటే దాని ఫ్రెండ్స్ ప్రభావమే ఎక్కువని తేలిపోయింది. యీ పరిస్థితిలో ఏం చెయ్యాలో తెలియడంలేదు" నిస్పృహగా అంది స్వరాజ్యం.

"బ్రతుకులో అతిముఖ్యమైన మలుపు, పెళ్ళి విషయంలో మంచేదో చెడేదో చెప్పకపోతేఎలా? తరువాత అది వింటుందో, వినదో దానిష్టం. చెప్పాల్సిన బాధ్యత పెద్దవాళ్ళ కుందిగదా!"

"చెప్పానమ్మా! మూణ్ణాళ్ళ ముచ్చటయి పోతున్న ఎన్నో కాపురాల్ని చూస్తున్నాక కూడా దానిని హెచ్చరించకుండా ఎలా వుంటాను? ఇద్దరూ కలకాలం అన్యోన్యంగా వుండి సంతోషంగా బ్రతికితే మాకు ఆనందమే కాని... మనిషికి ఒకవైపునే తెలుసుకుని దగ్గరయినప్పుడు రెండోవైపున్న బలహీనతలు అనుభవంలోకి వచ్చేసరికి సంఘర్షణ మొదలవుతుంది. రాజీపడి సర్దుకుని బ్రతక గలిగితే సరే. అలా బ్రతకలేనినాడు, ఒకవేళ విడిపోవలసిన పరిస్థితే వస్తే ధైర్యంగా, నిబ్బరంగా బ్రతకగల స్థాయి వుండాలికదా! 'నీ బ్రతుకు నువ్వు బ్రతుకుతూ ఎవరి మీదా ఆధార పడనప్పుడు నీకుండే విలువవేరు. ఒకరి మీద ఆధారపడి బ్రతికేప్పుడు వాళ్ళు నీమీద అధికారం చెలాయించడం, తక్కువగా చూడడం జరగొచ్చు. అది నువ్వు అంగీకరించగలవా?...' యివన్నీ ఆలోచించి నిర్ణయించుకోమని ఎంతో చెప్పాను ప్రీతితో. అది నాకంటే నాలుగాకులు ఎక్కువే చదివింది. 'బ్రతుక్కి నమ్మకం పునాది కావాలికాని అనుమానాలతో ప్రారంభం కారాదని' నాకు హితవు చెప్పింది. "పేలవంగా నవ్వింది స్వరాజ్యం. 'నిజమే పరస్పర విశ్వాసంతోనే జీవితాన్ని ప్రారంభించాలి. కాని నమ్మకాలు వేరు, వాస్తవాలు వేరు... అసలు మన బాధల్లా ప్రీతి తెలివితేటలుండి, చదువుకునే అవకాశముండికూడా తొందరపడి చదువుమానేసి పెళ్ళి చేసుకుంటోందని, ఆడపిల్ల ఒకరి మీద ఆధారపడకుండాతన బ్రతుకు తను బ్రతకగలిగిన స్థాయికి చేరుకోవలసిన అవసరాన్ని అది గుర్తించడం లేదని. రోజు రోజుకు పరిస్థితు లెంతదారుణంగా అవుతున్నాయో, విలువలెంత వేగంగా మారిపోతున్నాయో, మనిషి జీవితాన్ని డబ్బు ఎంతగా శాసిస్తూందో గమనిస్తూకూడా ప్రీతిఇలా ప్రవర్తిస్తూందంటే ఏమనుకోవాలో అర్థంకావడంలేదు." విచారంగా అంది భాగ్యలక్ష్మి.

"ఏంటి, అమ్మా కూతుళ్ళిరూ కలిసి ఏదో గూడుపుఠాణీ చేస్తున్నారు? తండ్రి వెంట బజారు కెళ్ళి వచ్చిన స్వాతి చిలిపిగా చూచింది. తమ అలజడిని కూతురు గమనించకుండా చిరునవ్వు నవ్వింది స్వరాజ్యం. 'ప్రీతి పెళ్ళితో పాటు నీపెళ్ళి కూడా చేసేస్తే ఖర్చుకలిసొస్తుంది, చేసేయ మంటోంది అమ్మమ్మ." గంభీరత నటిస్తూ అంది స్వరాజ్యం. "బాప్‌రే! అప్పుడే నాకు పెళ్ళా?... మరినాలక్ష్యం?! నేను బాగా చదువుకుని పేద్ద సైంటిస్ట్ నవ్వాలి. సమాజానికి నా కంట్రి బ్యూషన్ వుండాలి. ఆఫ్‌కోర్స్, పిల్లల కంట్రిబ్యూషన్ కాదు." గలగలానవ్వింది స్వాతి. స్వాతి వంక మురిపెంగా చూచింది భాగ్యలక్ష్మి.

భాగ్యలక్ష్మి, స్వరాజ్యం ఎంతగా వారించినా వినకుండా

చదువుకు స్వస్తి చెప్పి పెళ్ళి చేసుకోవటానికే నిశ్చయించుకుంది ప్రీతి. 'వాళ్ళకిచ్చే కట్నకానుకల సంగతి నాకు తెలియదు వాళ్ళూ మీరూ మాట్లాడు కోండి. పెళ్ళి మాత్రం గ్రాండ్‌గా చెయ్యాల'ని ఖండితంగా చెప్పేసింది. వియ్యాలవారి కోర్కెల్ని తీర్చడం, గ్రాండ్‌గా పెళ్ళి చేయడం ప్రీతి తండ్రీ శంకర్రావుకు తలకు మించిన భారమయినా కూతురి సంతోషంకోసం అన్నిటికీ సిద్ధపడ్డాడు.

ఆఖర్చు, ఆర్భాటం, అట్టహాసం భాగ్యలక్ష్మికి కంపరాన్ని కలిగిస్తున్నాయి. పాతికేళ్ళ క్రితం సాంప్రదాయాల్ని పట్టుకు వేళ్ళాడే రోజుల్లోనే పదిమంది స్నేహితుల సమక్షంలో సింపుల్‌గా దండలు మార్చుకుని పెళ్ళి చేసుకున్నారు స్వరాజ్యం, శంకర్రావు. పాతి కేళ్ళ తరువాత మరో అడుగు ముందుకు వెళ్ళాల్సింది పోయి నాలుగడుగులు వెనక్కు వేస్తున్నారు. పట్టుచీరలకు, నగలకు, కల్యాణ వేదిక అలంకరణకు, వీడియో షూటింగ్‌లకు, విందు భోజనాలకు ఒకర్ని చూచి మరొకరు పోటా పోటీగా పెడ్తున్న ఖర్చును చూస్తూ నేవున్నా తనకూతురు, అల్లుడు కష్టించి కూడ బెట్టిన డబ్బులా నీళ్ళలా ఖర్చవుతూంటే చాలా బాధగా వుందామెకు. ప్రతి విషయంలోనూ పాశ్చాత్యుల్ని అనుకరించే వ్యక్తులు వాళ్ళలా రిజిష్టర్ మారేజ్ చేసుకోవాల్సింది పోయి యింకా యింకా దండగమారి ఖర్చులెందుకు చేస్తున్నారో అర్థంకాలేదామెకు.

భాగ్యలక్ష్మి భావాలతో, అనుభూతులుతో నిమిత్తం లేకుండా ప్రీతి పెళ్ళి ఆమెకోరుకున్నట్లుగా గ్రాండ్‌గా జరిగిపోయింది. అన్నిటినీ అడిగి మరీ కొనిపించుకుని అత్తవారింటికి వెళ్ళింది ప్రీతి.

ప్రీతి పెళ్ళయాక కొడుకు దగ్గరకు వెళ్ళి పోతానని బయల్దేరిన భాగ్యలక్ష్మిని కొన్ని నెలలు తన దగ్గ రుండమని కోరింది స్వరాజ్యం. పెళ్ళయాక మరీ వింతగా మారిన ప్రీతి కళాకళల్ని గమనిస్తూ అసంతృప్తిగా వున్న భాగ్యలక్ష్మి అయిష్టంగానే ఆగిపోయింది.

పెళ్ళయిన నెలరోజులకు వాసుకు బొంబాయికి ట్రాన్స్‌ఫర్ అవడంతో వాసు, ప్రీతి బొంబాయి వెళ్ళిపోయారు. బొంబాయి వెళ్ళిన వెంటనే క్షేమ సమాచారాలతో ఉత్తరం వ్రాసిన ప్రీతి రెండు నెలల దాకా మళ్ళీ ఒక్క ఉత్తరానికీ జవాబివ్వలేదు. కూతురు ఒంటరిగా కాపురాన్ని ఎలా చక్కబెట్టు కుంటూందోనని ఆందోళన పడుతున్న స్వరాజ్యం ఒక సారి బొంబాయి వెళ్ళి ప్రీతిని చూచిరమ్మని శంకర్రావును పోరుతోంది. శంకర్రావు బయల్దేరు దామని అనుకుంటూండగా భాగ్యలక్ష్మికి ప్రీతి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. వాళ్ళమ్మకు వ్రాయకుండా తనకెందుకు వ్రాసిందోనని ఆశ్చర్యపడుతూ లెటరు విప్పింది భాగ్యలక్ష్మి.

"అమ్మమ్మా!

నా అజ్ఞానంతో, అస్తవ్యస్తపు ఆలోచనలతో, అవక తవక పనుల్తో మిమ్మల్ని ప్రత్యేకించి నిన్ను చాలా కష్టపెట్టాను కదూ?!

ఇక్కడకు వచ్చాక వాసు ఆఫీసుకు వెళ్ళిపోతే యింక పుస్తకాలే నాకు కాలక్షేపం. ఫ్రెండ్స్ లేక పోవడం వల్ల, తీరిక ఎక్కువగా వుండడం వల్ల మంచి పుస్తకాలు చదవడానికి వీలయింది. నా మనస్తత్వాన్ని నా ప్రవర్తనను తరచి చూచుకోవడానికి కూడా అవకాశం చిక్కింది. నాలోకి నేను తొంగి చూచుకుని నేనెంత అయోమయంలో వున్నానో గుర్తించాను.

భద్రత లేని జీవిత పరిస్థితులు, ప్రతిభకు ఫలితం లేకుండా, నిజాయితీకి నీడ లేకుండా చేస్తున్న కులం, మతం, ఆశ్రిత పక్ష పాతం, అన్నిటినీ మించి సమస్త విలువల్నీ పరిపాలిస్తున్న 'డబ్బు' నన్ను నాఫ్రెండ్స్‌ని, మాలాంటి యువతని నిరాశా నిస్పృహల్లోకి నెట్టుతున్నాయి. బ్రతుకు భయం మమ్మల్ని స్థిమితంగా ఆలోచించనివ్వడం లేదు. చాలామంది సుఖంగా జీవించడానికి సులభంగా ఏ ఆధారం దొరుకుతుందా అని చూస్తున్నామే తప్ప, 'ఈజీ మనీ' కోసం ఆశ పడుతున్నామే తప్ప మా నిరాశా నిస్పృహలకు కారణమయిన సామాజిక పరిస్థితులతో పోరాడి, రాజకీయ శక్తులతో తలపడి మాకు న్యాయంగా దక్క వలసిం దాన్ని పొందుదామన్న పూనిక మాకుండడం లేదు. మా భవిష్యత్తుకు, మాభావితరాల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాల్సిన గురుతరమైన బాధ్యత మామీదేవుందని మేము గుర్తించడం లేదు. 'ఈ సమాజం మాకేమిస్తోంది?' అని కోపగిస్తున్నామే తప్ప ఒక్కక్షణం ఆగి 'ఈ సమాజానికి మేమే మిస్తున్నాం' అని ఆలోచించడం లేదు. అస్థిరత్వంతో, అయోమయంతో సంచరిస్తున్న యువశక్తి తమకు పథ నిర్దేశం చేసి ఉన్నత లక్ష్యం వైపు ఉజ్వల భవిష్యత్తు వైపునడిపించగల మహనీయ నేతల కోసం కొండంత ఆశతో ఎదురు చూస్తూంది.

అమ్మమ్మా! సక్రమంగా ఆలోచించేస్థితిలో లేనినేను అమ్మ,నువ్వు ఈనాటి సమాజంలో ఆడపిల్ల చదువుకుని తీరాల్సిన అవసరం గురించి పదే పదే చెప్తూంటే అది మీచాదస్తంగా కొట్టి పారేసాను, సమాజానికి నా కంట్రిబ్యూషన్ వున్నప్పుడే నా బ్రతుక్కు అర్థం, పరమార్థం అనే అర్థం వచ్చేలా స్వాతి అంటూంటే దానివి ముదిమాటలని వెక్కిరించాను. అమ్మ, నాన్నగారు తినీ తినక కూడబెట్టిన డబ్బును నిస్సిగ్గుగా వృధా చేయించాను... పురుషాధిక్య సమాజంలో ఆర్థికంగా అస్వతంత్రురాలయిన స్త్రీ ఎంత నిస్సహాయంగా అత్యాచారాలకు గురవుతుందో అను నిత్యంగమనిస్తూ కూడా మీ హెచ్చరికల్ని పెడచె విన పెట్టాను ... సావకాశంగా ఆలోచించాక, ఆత్మవి మర్శచేస్కున్నాక నేనెంత భ్రమలో కొట్టు మిట్టాడుతున్నానో అర్థమయింది. నాఅందంతో నేర్పుతో వాసును గెలుచుకున్నా నన్న అతిశయంతో వున్న నాకు, అదే జీవితంలో పెద్ద 'ఎఛీవ్ మెంట్' అని గర్వపడుతున్న నాకు వ్యక్తిగా నేను సాధించవలసిన విలువైన అంశాలెన్నో వున్నాయని ఆలస్యంగానైనా గ్రహింపుకొచ్చింది. నిస్సారంగా, నిరుపయోగంగా కేవలం ప్రాణాలతో నిలబడడం బ్రతుకుకాదని, సంపూర్ణ చైతన్యంతో జీవితాన్ని ఛాలెంజ్‌గా స్వీకరించడమే నిజమైన బ్రతుకని గుర్తించాను.

కాని... జరిగిపోయిన నాపెళ్ళిగురించి నేను చింతించడం లేదు. వృధా అయిన ఒక సంవత్సరం గురించి బాధ పడుతూ సద్వినియోగ పరచుకోవలసిన ముందుకాలాన్ని విస్మరించడంలేదు. గృహిణిగా నాకర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే చదువులో లక్ష్యాన్ని సాధించగలనన్న ఆత్మ విశ్వాసంనాకుంది. ఆ ఆత్మవిశ్వాసంతో, అమ్మ నాన్నగారు, నువ్వు నాకిచ్చే ప్రోత్సాహబలంతో, వాసు నాకందించే సహకారంతో ముందడుగు వేయగలనని నేను నమ్ముతున్నాను. నాగురించి అమ్మకన్న కలల్ని సఫలం చెయ్యడానికి మెడికల్ ఎంట్రెన్స్‌కి చదువుతున్నాను.

అమ్మమ్మా! నీకు సంతోషంగా వుందా?! నాపిచ్చి ప్రవర్తనను మరిచిపోయి నీ ఆశీస్సులందిస్తావా?

నీ
ప్రీతి.



చల్లా. జయలలిత

చల్లా జయలలిత తన సోదరి శ్రీలక్ష్మితో పాటుగా 'చల్లా సిస్టర్స్'గా కళాప్రపంచానికి సుపరిచితురాలు. కుమారి జయలలిత తన ఐదవ ఏటనే ప్రముఖ నాట్యాచారిణి శ్రీమతి వాసిరెడ్డి కనకదుర్గవద్ద నాట్యం అభ్యసించడం ఆరంభించారు. శ్రీ చింతా రాధాకృష్ణమూర్తి వద్ద కూచిపూడి నాట్యంలోని అన్ని అంశాలను అమూలాగ్రంగా అభ్యసించారు. తరువాత శ్రీ బి. ఎన్. వరదరాజయ్యంగార్‌వద్ద భరత నాట్యం నేర్చుకున్నారు. శ్రీ జోశ్యుల సీతారామశాస్త్రివద్ద నాట్యంలోని మెళకువలూ, క్రొంగొత్త రీతుల్ని అధ్యయనం చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాలలో నాట్య ప్రదర్శనలు ఇచ్చిన జయలలిత విదేశాలల్లోను నాట్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

—సి హెచ్. జయ